జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ, డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక



చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com




# రిమ్స్‌లో ఆందోళనల పర్వం



## ప్రభుత్వ మెడికల్ కళాశాల వద్ద జూడాల నిరసన

* సమస్యలు పరిష్కరించాలని నినాదాలు
* రిమ్స్‌లో అత్యవసర సేవలు మినహా నిలిచిన వైద్యసేవలు
* ఇబ్బందులు పడుతున్న రోగులు

శ్రీకాకుళం, ఆగస్టు 11 (వార్త): ఏపీ జూనియర్ డాక్టర్ల (జూడా) అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీకాకుళంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి జూనియర్ డాక్టర్లు మంగళవారం ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ప్రభుత్వ వైద్య కళాశాలలు, బోధనా ఆసుపత్రుల్లో పనిచేస్తున్న జూనియర్ రెసిడెంట్లు, సీనియర్ రెసిడెంట్లు, సూపర్ స్పెషాలిటీ పీజీ విద్యార్థులు డిమాండ్ చేశారు. ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు. మంగళవారం ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు వైద్యసేవలను నిలిపివేశారు. అత్యవసర వైద్యసేవలు, ఐసీయూ సేవలు మాత్రం అందించారు. తమ సమస్యలు పరిష్కారమయ్యే వరకూ పోరాటాన్ని దశలవారీగా చేపడతామని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో సతీష్, మదన్, ప్రసన్న, సుదర్శన్, అశోక్, శశితోపాటు పలువురు వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

## వేతనాలు చెల్లించాలని కాంట్రాక్టు నర్సుల నిరసన



రిమ్స్‌లో కాంట్రాక్ట్ పద్ధతిలో సుమారు 150 మంది వరకూ నర్సులు పనిచేస్తున్నారు. వారికి గత ఐదు నెలలుగా జీతాలు చెల్లించడం లేదు. దీంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ కాంట్రాక్ట్ నర్సుల సంఘం శ్రీకాకుళం జిల్లా శాఖ సోమవారం కలెక్టర్‌కు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేయడంతో పాటు రిమ్స్‌లో నిరసన తెలిపారు. వెంటనే పెండింగ్ జీతాలు చెల్లించి తమ కుటుంబాలను ఆదుకోవాలని ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం సమర్పించారు. జీతాలు లేక.. కుటుంబ పోషణ భారంగా ఉందని, ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని వారంతా ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో కలెక్టర్ సైతం రిమ్స్‌కు వైద్యాధికారులతో చర్చించారు. ఈ సమస్యను వెంటనే పరిష్కరించేలా చూడాలని ఆదేశించారు.

### పారిశుధ్య కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

శ్రీకాకుళం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్) లో తొలగించిన 23 మంది పారిశుధ్య కార్మికులను తక్షణమే తిరిగి విధుల్లోకి తీసుకోవాలని దళిత ప్రజా సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) డిమాండ్ చేసింది. సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేసిన విషయం తెలిసిందే. చట్టబద్ధంగా రావాల్సిన కనీస వేతనాలు అడిగినందుకే కక్షసాధింపుగా పారిశుధ్య కార్మికులను ఉద్యోగాల నుంచి తొలగించారని ఆరోపించారు. నిర్ణీత గడువులోగా సమస్య పరిష్కరించకపోతే రిమ్స్ ప్రధాన గేట్ వద్ద పెద్ద ఎత్తున నిరసన, ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

# గౌతు కుటుంబంతో.. సుమన్ మంతనాలు

* ఈ భేటి వెనుక వ్యూహమేంటి? * మర్యాద పరంగా భేటీనా.. రాజకీయ సంకేతమా? * పలాస రాజకీయాల్లో హాట్‌టాపిక్!

పలాస, ఆగస్టు 11 (వార్త):సినీ నటుడు సుమన్ పలాసలో మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నాయకుడు గౌతు శివాజీ, పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషను మంగళవారం సాయంత్రం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా వారితో కొద్దిసేపు ఆత్మీయంగా మాట్లాడారు. సుమన్ రాకతో స్థానిక రాజకీయ, సినీ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, పలాస నియోజకవర్గంలో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సమస్యలు తదితర అంశాలపై సమావేశంలో సాధారణంగా చర్చ జరిగినట్లు తెలిసింది. ప్రజా జీవనంతో ముడిపడిన అంశాలపై సినీ నటుడు సుమన్ ఆసక్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. ఇటీవల పలాస నియోజకవర్గంలో అధికార టీడీపీ శ్రేణులు స్థానిక రాజకీయ కార్యకలాపాలను విస్తృతం చేస్తున్న నేపథ్యంలో సుమన్ గౌతు కుటుంబాన్ని కలవడం ప్రాధాన్యం సంతరించుకుంది. ముఖ్యంగా మాజీ మంత్రి గౌతు శివాజీ, ఎమ్మెల్యే గౌతు శిరీషతో ఒకే సందర్భంలో భేటీ కావడం రాజకీయ వర్గాల దృష్టిని ఆకర్షించింది. ఈ భేటీ పూర్తిగా మర్యాదపూర్వకంగానే జరిగిందా? లేక భవిష్యత్‌లో ఏదైనా సామాజిక, సాంస్కృతిక కార్యక్రమానికి సంబంధించిన చర్చ జరిగిందా? అనే అంశంపై స్థానికంగా చర్చ సాగుతోంది. భేటీకి సంబంధించి సుమన్ లేదా గౌతు కుటుంబం నుంచి ఎలాంటి రాజకీయ ప్రకటన వెలువడలేదు. పలాస నియోజకవర్గంలో మౌలిక వసతులు, అభివృద్ధి పనులు, ప్రజల సంక్షేమం వంటి అంశాలు ప్రస్తుతం రాజకీయ చర్చల్లో ప్రధానంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో సినీ రంగానికి చెందిన ప్రముఖుడు స్థానిక ప్రజాప్రతినిధులను కలవడం సహజంగానే ఆసక్తిని రేకెత్తించింది. మర్యాదపూర్వక భేటీ అయినప్పటికీ ప్రస్తుత రాజకీయ వాతావరణంలో ప్రముఖుల రాకపోకలు, ప్రజాప్రతినిధులతో వారి సమావేశాలు చర్చనీయాంశంగా మారుతున్నాయి. సుమన్ భేటీ కూడా ఇదే కోణంలో పలాస రాజకీయ వర్గాల్లో ఆసక్తి కలిగించింది. మొత్తానికి.. సినీ నటుడు సుమన్-గౌతు శివాజీ-గౌతు శిరీషల భేటీ రాజకీయ ప్రకటనలకు దారితీయకపోయినా, ప్రస్తుత రాజకీయ నేపథ్యంలో ఆసక్తికర పరిణామంగా నిలిచింది. భవిష్యత్‌లో ఈ భేటీకి సంబంధించి మరిన్ని వివరాలు వెలువడతాయా అన్నది వేచి చూడాల్సిందే. ఈ భేటీలో ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబురావు, జిల్లా గ్రంథాలయం చైర్మన్ పీరుకట్ల విఠల్, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి లోడగల కామేష్, పిసిఎంప కోశాధికారి టంకాల రవిశంకర్ గుప్తా, తమ్మినేని గంగారం పాల్గొన్నారు.



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## మెరిట్ స్కాలర్‌కు ఎంపికైన కౌశిక్



**మందస, ఆగస్టు 11(వార్త):** సొండిపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న లండ కౌశిక్ మెరిట్ స్కాలర్‌కు ఎంపికయ్యాడు. ఎన్.ఎం.ఎం.ఎస్ 2025–26 ఫలితాలలో లండ కౌశిక్ 180 మార్కులకు 129 మార్కులు సంపాదించి మెరిట్ స్కాలర్‌కు అర్హత పొందాడు. ఈ సందర్భంగా కౌశిక్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నగిరి కరుణాకర్, సిబ్బంది అభినందించారు.

## వెంకటరమణ కుటుంబానికి ఆర్థికసాయం



**మందస, ఆగస్టు 11(వార్త):** లొహరిబంద గ్రామానికి చెందిన నర్తు వెంకటరమణ రోడ్డు ప్రమాదంలో మరణించారు. వెంకటరమణ పేద కుటుంబం కావడంతో పలువురు ఆర్థిక సాయం అందజేస్తున్నారు. లొహరిబంద పాఠశాలలో 2016–2017 బ్యాచ్ చదువుకున్న విద్యార్థులు తమ వంతు సహాయంగా 12,000 రూపాయలు ఆర్థిక సహాయం చేశారు. మృతుడు వెంకటరమణ పిల్లల భవిష్యత్తు దృష్టిలో పెట్టుకొని చేయి చేయి కలపడమే కాకుండా ఒక్క ఐక్యతతో ఆర్థిక సహాయం చేయడంపై స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

## ప్లాస్టిక్ వ్యర్థాల నివారణకు ప్రత్యేక చర్యలు

- సంపద తయారీ కేంద్రాలకు తరలించాలి
- అధికారులకు సూచనలు చేసిన ఎంపీడీవో





**జలుమూరు, ఆగస్టు 11 (వార్త):** జలుమూరు మండలంలోని గ్రామాల్లో ప్లాస్టిక్ వ్యర్థాల నివారణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని అధికారులు నిర్ణయించారు. గ్రామాల్లో పేరుకుపోతున్న ప్లాస్టిక్ వ్యర్థాలను నియంత్రించడంతో పాటు వాటిని పద్ధతి ప్రకారం సేకరించి, వేరు చేసి సంపద తయారీ కేంద్రాలకు తరలించే విధానంపై ఎంపీడీవో కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణకు అనుసరించాల్సిన షెడ్యూల్, వ్యర్థాలను తడి, పొడి మరియు ప్లాస్టిక్ వ్యర్థాలుగా వేరు చేయడం, సేకరించిన ప్లాస్టిక్‌ను సంపద తయారీ కేంద్రాలకు తరలించడం వంటి అంశాలపై అధికారులకు సూచనలు చేశారు. గ్రామాల్లో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచడంతో పాటు ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలను తగ్గించేందుకు ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. ఇంటింటి నుంచి వ్యర్థాలను సక్రమంగా సేకరించేలా చర్యలు తీసుకోవడంతో పాటు ప్లాస్టిక్ వ్యర్థాలు బహిరంగ ప్రదేశాల్లో పడకుండా పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో చిన్నమ్మడు, ఈఓపీఆర్‌డీ ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. మండలంలోని గ్రామ సచివాలయ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు కూడా సమావేశానికి హాజరయ్యారు.

## చిన్నారుల భవితపై ప్రత్యేక దృష్టి సారించాలి

**జలుమూరు, ఆగస్టు 11 (వార్త):** అంగన్వాడీ కేంద్రాల్లో ఉన్న చిన్నారుల భవితవ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంఈఓలు బమ్మిడి మాధవరావు, ఎన్.వి.ఆర్.ఎస్. ప్రసాదరావు సూచించారు. మంగళవారం జలుమూరు ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస్ పీవో వంశీ ప్రియ ఆధ్వర్యంలో నిర్వహించిన జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. చిన్నారులలో విజ్ఞాన శక్తిని పెంపొందించడంతో పాటు వారి ఆరోగ్య స్థితిగతులను మెరుగుపరిచే దిశగా అంగన్వాడీ కార్యకర్తలు ప్రత్యేకంగా కృషి చేయాలని సూచించారు. చిన్నారుల వయసుకు అనుగుణంగా విద్యాబోధన, ఆటల ద్వారా అభ్యసనకు ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు. అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు పౌష్టికాహారం అందించడంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వారి ఆరోగ్యం, ఎదుగుదలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారులు సూచించారు. బాల్యంలోనే విద్య, ఆరోగ్యం, పోషకాహారంపై సరైన శ్రద్ధ చూపితే పిల్లల భవిష్యత్తు మెరుగ్గా ఉంటుందని తెలిపారు. శిక్షణ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలకు చిన్నారుల సమగ్ర అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# స్థానిక సమరానికి ..
# టీడీపీ సన్నద్ధత



- సంక్షేమం.. అభివృద్ధి ఇంటింటికీ చేరాలి
- పార్టీ శ్రేణులకు ఎమ్మెల్యే శిరీష దిశానిర్దేశం

**పలాస, ఆగస్టు 11 (వార్త):** స్థానిక సంస్థల ఎన్నికలకు తెలుగుదేశం పార్టీ శ్రేణులు ఇప్పటి నుంచే సమాయత్తం కావాలని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష పిలుపునిచ్చారు. గ్రామస్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ఇంటింటికీ తీసుకెళ్లాలన్నారు.

### ఎన్నికల సన్నద్ధతపై కసరత్తు

పలాస ఎమ్మెల్యే.. తన కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గ పార్టీ శ్రేణులతో స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధతపై సమావేశం నిర్వహించారు. క్షేత్రస్థాయిలో పార్టీ పరిస్థితి, నాయకులు–కార్యకర్తల సమన్వయం, ప్రజలతో సంబంధాలు తదితర అంశాలపై చర్చించారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ఎదుర్కొనేలా పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష సూచించారు.

### ఇంటింటికీ ప్రభుత్వ పథకాలు

గ్రామాలు, వార్డుల్లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కారానికి కృషి చేయాలని, ప్రజలకు అందుబాటులో ఉండేలా నాయకులు వ్యవహరించాలని అన్నారు.

### ఐక్యతతో ముందుకు సాగాలి

పార్టీ నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయం మరింత బలోపేతం కావాలని ఏపీటీపీసీ చైర్మన్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి వజ్జ బాబూరావు సూచించారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని పేర్కొన్నారు.

### గ్రామ, వార్డు స్థాయిలో కార్యాచరణ

స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని గ్రామ, వార్డు స్థాయిలో పార్టీ కార్యకలాపాలను వేగవంతం చేయాలని సమావేశంలో నిర్ణయించారు. ప్రజల సమస్యలు, ప్రభుత్వ పథకాల అమలు, అభివృద్ధి కార్యక్రమాలపై ఎప్పటికప్పుడు సమాచారం సేకరిస్తూ ప్రజలకు చేరువగా ఉండాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. సమావేశంలో నియోజకవర్గ పార్టీ నాయకులు, మండలాల ముఖ్య నాయకులు, వివిధ విభాగాల ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## చిన్నారులకు అర్థవంతంగా బోధించాలి



**మందస, ఆగస్టు 11(వార్త):** అంగన్ వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అంగన్ వాడీ కార్యకర్తలు అర్థవంతంగా బోధించాలని మందస మండల విద్యాశాఖాధికారి మద్రిపాటి లక్ష్మణరావు, ఐసీడీఎస్ ప్రాజెక్టు మందస సీడీపీఓ పెద్దింటి అరుణ అన్నారు.

మందస మండలంలోని హరిపురంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంగన్ వాడీ కార్యకర్తలకు ఎఫ్ఎల్ఎన్ 3. 0 జ్ఞాన ప్రకాష్ శిక్షణ కోర్సుకు సంబంధించి మూడు రోజులు శిక్షణలో భాగంగా మొదటి రోజు శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు, అరుణ మాట్లాడుతూ అంగన్ వాడీ కేంద్రాల్లో ప్రతీ చిన్నారికి అర్థవంతంగా చదవడం, ఉద్దేశ్యపూర్వకంగా రాయడం, సంఖ్యా జ్ఞానాన్ని అర్థం చేసుకోవడం వంటి నైపుణ్యాలు అభివృద్ధి చేసే విధంగా తీర్చిదిద్దాలన్నారు. ఈ శిక్షణ ముఖ్య ఉద్దేశ్యం కూడా ఇదేనన్నారు. అంగన్ వాడీ సెంటర్లలలో ప్రీ ప్రైమరీ విద్యార్థులను ఎలా బోధించాలి అనే విషయంపై అంగన్ వాడీ వర్కర్స్ కు ట్రైనింగ్ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇంగ్లీష్ భాషపై అవగాహన కలిగించడానికి ఈ సెక్షన్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. శిక్షణను సద్వినియోగం చేసుకుని అంగన్ వాడీ సెంటర్లో ఇంప్రూమెంట్ చేయాలని కోరారు.

డిపార్ట్ మెంట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ సర్వ శిక్ష అభియాన్, ఉమెన్ డెవలప్మెంట్ అండ్ చైల్డ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి మద్రిపాటి లక్ష్మణరావు, సీడీపీఓ పెద్దింటి అరుణ, పాఠశాల హెచ్ఎం లఖినాన సాంబమూర్తి, డీఆర్పీలు అంపోలు వల్లభరావు, సార భాస్కరరావు, నల్ల కిరణ్ కుమార్, ఐసీడీఎస్ సూపర్ వైజర్లు సీహెచ్.వి.రామలక్ష్మి, జయలక్ష్మి, లక్ష్మి, సుమారు 170 మంది అంగన్ వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేడు చల్లవానిపేటలో మెగా జాబ్ మేళా

- యువతకు సువర్ణావకాశం
- ఉద్యోగ మేళాను సద్వినియోగం చేసుకోవాలి
- ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి బగ్గు అర్చన పిలుపు

**జలుమూరు, ఆగస్టు 11(వార్త):** నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో జలుమూరు మండలం చల్లవానిపేటలోని వంశధార డిగ్రీ కళాశాల ప్రాంగణంలో బుధవారం మెగా ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే ఈ ఉద్యోగ మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వహక కార్యదర్శి బగ్గు అర్చన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి మాట్లాడుతూ.. ప్రస్తుత పోటీ ప్రపంచంలో యువతకు ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవడం ఎంతో ముఖ్యమన్నారు. ఉద్యోగాన్వేషణలో ఉన్న యువతకు ఒకే వేదికపై వివిధ రంగాలకు చెందిన సంస్థల ప్రతినిధులతో నేరుగా ఇంటర్వ్యూలకు హాజరయ్యే అవకాశం కల్పిస్తున్నామని తెలిపారు. ఈ అవకాశాన్ని ఏమాత్రం వదులుకోకుండా పెద్ద సంఖ్యలో యువత పాల్గొని తమ ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని కోరారు. ఉద్యోగ మేళాలో స్థానిక సంస్థలతో పాటు దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన పలు ప్రముఖ బహుళజాతి సంస్థలు పాల్గొననున్నట్లు తెలిపారు. సాఫ్ట్‌వేర్, ఫార్మా, మార్కెటింగ్, బ్యాంకింగ్, ప్రొడక్షన్ తదితర రంగాలకు చెందిన కంపెనీల ప్రతినిధులు అభ్యర్థులకు ముఖాముఖి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 10వ తరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, పీజీ విద్యార్హతలు కలిగిన యువతీ యువకులు తమ అర్హతకు అనుగుణంగా ఉద్యోగ అవకాశాలను పొందేందుకు ఈ మేళా ఉపయోగపడుతుందని నిర్వాహకులు తెలిపారు. ఉద్యోగ మేళాకు హాజరయ్యే అభ్యర్థులు తమ విద్యార్హతల ఒరిజినల్, జిరాక్స్ సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు, కనీసం ఐదు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు, అప్‌డేటెడ్ రెజ్యూమ్ వెంట తీసుకురావాలని సూచించారు. అభ్యర్థులు ఉదయమే కళాశాల ప్రాంగణానికి చేరుకుని రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని కోరారు. నిరుద్యోగ సమస్యను తగ్గించి స్థానిక యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. నరసన్నపేట నియోజకవర్గంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి అర్హులైన యువత పెద్ద సంఖ్యలో హాజరై మెగా జాబ్ మేళాను విజయవంతం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.




| S.No | Company Name | Job Location | Job Role | Qualification | Gender | Age | Salary | No. Of Vacancies |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 | Tech Mahindra | Hyderabad,Bangalore | International Voice process | Any Graduate with Good Communication Skills | Male/Female | 18 - 27 yrs | 3.00 to 4.5 LPA Transport Free | 40 |
| | | Hyderabad | Domestic Voice Process | Any Graduate with Hindi & English 6 Months Experience | Male/Female | 18 - 27 yrs | 3.00 LPA | 30 |
| 2 | Wipro Infrastructure Engineering | Tamilnadu | Trainee/Production Associate | ITI/Diploma/BE | Male/Female | 18 - 26 Yrs | 20,300/- | 50 |
| 3 | Apitoria | Visakhapatnam,Hyderabad | SMT Production | Intermediate/Any Degree | Male | 18 - 30 yrs | 2.55 LPA | 30 |
| 4 | Bandhan Bank | Narasannapeta,Srikakulam,Ranastalam, Tekkali,Palasa,Pathapatnam,Amadalavalasa, Ichapuram,Sompeta,Kothuru, Palakonda | 1.Relation Officer 2.Relationship Executive 3.Collection Officer | Intermediate or Degree | Male | 21 - 30 yrs | 16000/- (Please Carry Aadhar & Pan Card Xerox copies) | 20 |
| 5 | Aditya Drier | Visakhapatnam,All over AP | Client Manager | BE/B.Tech/Diploma(Mechanical) | Male | 18 - 45 yrs | 1.8 to 2.2 LPA | 10 |
| | | Visakhapatnam | Carpenter (Modular Kitchen) | Below SSC | Male | 18 - 45 yrs | 25000/- | 5 |
| 6 | Hetero Labs Ltd | Nakkapally | Junior Chemist | Graduates with Chemistry(B.sc Chemistry,CBZ,MPC,HONOURS) | Male | 18 - 26 Yrs | 21,626/- | 50 |
| | | Srikakulam(Local),Narasannapeta, | 1. Pharmacy Aide | D/B Pharmacy with PCI Certificate | | | 1)16000/- to | |

## నరసన్నపేట అభివృద్ధిపై సమీక్ష

- సమస్యలను తక్షణమే పరిష్కరించాలి
- డిప్యూటీ ఎంపీడీవో జగన్మోహన్‌రావు



**నరసన్నపేట, ఆగస్టు 11(వార్త):** నరసన్నపేట మేజర్ పంచాయతీ అభివృద్ధి, ప్రజలకు అందుతున్న సేవలపై డిప్యూటీ ఎంపీడీవో, ఇన్‌చార్జ్ ఈవోపీఆర్డీ జగన్మోహన్‌రావు అధికారులతో సమీక్ష నిర్వహించారు. మంగళవారం నరసన్నపేట మేజర్ పంచాయతీ కార్యాలయంలో స్థానిక నాలుగు సచివాలయాల పరిధిలోని అధికారులు, సిబ్బందితో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పంచాయతీ పరిధిలోని సమస్యలు, ప్రజలకు అందుతున్న మౌలిక సదుపాయాలు, వివిధ ప్రభుత్వ సేవల అమలుపై అధికారులతో చర్చించారు. పంచాయతీ పరిధిలో ఏవైనా సమస్యలు గుర్తించిన వెంటనే వాటిని పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు సకాలంలో అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. విధుల నిర్వహణలో ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా తన దృష్టికి తీసుకురావాలని జగన్మోహన్‌రావు పేర్కొన్నారు. సమస్యలను పెండింగ్‌లో ఉంచకుండా ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాలని సూచించారు. పంచాయతీ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంపై ఇకపై ప్రతి మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా అధికారులు నిరంతరం పనిచేయాలని ఆయన సూచించారు.

## రోడ్డు పక్కన చెత్త కుప్ప..
## ప్రయాణికులకు అవస్థలు

- చీడిపూడి చెరువు సమీపంలో పారిశుద్ధ్య సమస్య
- చెత్త తొలగించి పరిశుభ్రత చర్యలు చేపట్టాలని స్థానికుల విజ్ఞప్తి

**సారవకోట, ఆగస్టు 11(వార్త):** చీడిపూడి చెరువు సమీపంలో రోడ్డు పక్కనే పేరుకుపోయిన చెత్త కుప్పతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బుడితి నుంచి చీడిపూడి మీదుగా జలుమూరు మండలంలోని శ్రీమన్నారాయణపురం వెళ్లేందుకు ఈ రహదారి ప్రధాన మార్గంగా ఉండటంతో నిత్యం వాహనాల రాకపోకలు కొనసాగుతుంటాయి. అయితే రహదారి పక్కనే పెద్దఎత్తున చెత్త పేరుకుపోవడంతో పరిసర ప్రాంతాల్లో అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. చెత్త కుప్పల వద్ద పందులు, కుక్కలు యథేచ్ఛగా సంచరిస్తుండటంతో ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. దుర్వాసనతో పాటు చెత్త రోడ్డుపైకి చేరే అవకాశం ఉండటంతో ప్రమాదాలు జరిగే పరిస్థితి ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన రహదారి పక్కనే ఈ పరిస్థితి నెలకొనడంతో సంబంధిత అధికారులు వెంటనే స్పందించి చెత్తను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. భవిష్యత్తులో రోడ్డు పక్కన చెత్త వేయకుండా చర్యలు తీసుకోవడంతో పాటు క్రమం తప్పకుండా పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజల ఆరోగ్యం, ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని అధికారులు తక్షణమే సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక



# రిమ్స్‌లో తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్

**- అత్యాధునిక సౌకర్యాలతో (102) వాహనాలు**

**- విద్యా, వైద్యానికి పెద్ద పీట**

**-శాసనసభ్యులు గొండు శంకర్**

**శ్రీకాకుళం ఆగస్టు 11 (వార్త):** జిల్లా ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించే దిశగా తేదీ. 11.8.2026న శ్రీకాకుళం గౌరవ శాసనసభ్యులు గొండు శంకర్ గారి అధ్యక్షతన, మరియు ఇంచార్జ్ జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖాధికారి డా॥ తాడెల శ్రీకాంత్ , ఐఇసూ వారి ఆధ్వర్యంలో చీ.ఎ.వీ మాతృ ఆరోగ్యం మరియు పోషణ విభాగం 102 తల్లీ బిడ్డ ఎక్స్ప్రెస్ సేవలు (డ్రాప్ బ్యాక్ సేవలు) అందించుటకు గాను, (8) తల్లీ బిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలను స్థానిక శాసనసభ్యులు గొండు శంకర్, రిమ్స్ (=xమీా) ఆసుపత్రి ప్రాంగణం, శ్రీకాకుళంలో లాంచనంగా జండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా గౌరవ శాసనసభ్యులు గొండు శంకర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ ఆరోగ్య సంస్థలలో ప్రసవించిన తల్లులు మరియు వారి నవజాత శిశువులను సురక్షితంగా వారి నివాసాలకు సకాలంలో పంపించుటకు తల్లీబిడ్డ ఎక్స్ప్రెస్ లను అత్యాధునిక సౌకర్యాలతో అందించబడినవని తద్వారా మాతృ మరియు శిశు మరణాలను తగ్గించవచ్చునని మరియు లబ్ధిదారులకు డబ్బు ఆదా అవుతుందని ఆయన అన్నారు. ఈ ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం ఏర్పడిన ప్రభుత్వమని, ముఖ్యంగా విద్యా మరియు వైద్యరంగాలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత నిలుస్తుందని



తెలిపారు. ఈ కార్యక్రమంలో జి.జి. హెచ్. సూపరింటెండెంట్ జి. సౌమిని, గవర్నమెంట్ మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ ఎస్. అప్పలనాయుడు, 102 డిస్ట్రిక్ కోఆర్డినేటర్ బాసూరు విజయ కుమార్, డిప్యూటీ డెమో కె. యర్రన్న, డిప్యూటీ హెచ్.ఇ.ఓ పి.మోహిని రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా టీడీపీ యువనేత చంద్రమౌళి జన్మదిన వేడుకలు

**- కేక్ కట్ చేసిన ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబురావు..**

**- యువత మరింత చురుగ్గా పనిచేయాలి : ఎమ్మెల్యే గౌతు శిరీష**



**పలాస, ఆగస్టు 11 (వార్త):** గరుడఖండిలో తెలుగుదేశం పార్టీ యువజన నేత సాసుమాన చంద్రమౌళి జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువత, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏపీటీపీసీ చైర్మన్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి వజ్జ బాబురావు.. చంద్రమౌళితో కలిసి కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు జీవించాలని ఆకాంక్షించారు. పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషగౌతు శిరీష చంద్రమౌళికి ప్రత్యేకంగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. టిడిపి పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంలో యువత మరింత చురుగ్గా పనిచేయాలని సూచించారు. ప్రజాసేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ పార్టీ పట్ల నిబద్ధతతో పనిచేసే యువతను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. చంద్రమౌళి భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదిగి ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షించారు. గరుడఖండి ప్రాంతంలో తెలుగుదేశం పార్టీ కార్యక్రమాలను బలోపేతం చేయడంలో యువత కీలక పాత్ర పోషిస్తోందని నాయకులు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా చంద్రమౌళిని నాయకులు, కార్యకర్తలు, యువత శాలువాలతో సత్కరించి పుష్పగుచ్ఛాలు అందజేశారు. కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో ఉత్సాహంగా సాగింది.

### ప్రజాసేవే లక్ష్యం..పార్టీ బలోపేతమే ధ్యేయం

యువతతో కలిసి పార్టీ బలోపేతానికి మరింత చురుగ్గా పనిచేస్తానని చంద్రమౌళి తెలిపారు. తన జన్మదినం సందర్భంగా శుభాకాంక్షలు తెలిపిన వజ్జ బాబురావు, ఎమ్మెల్యే గౌతు శిరీషతో పాటు నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు.

## రాజీ కేసులపై ప్రత్యేక దృష్టి

**- జాతీయ లోక్అదాలత్‌కు ముందే గుర్తింపు**

**- పోలీసు, ఎక్సైజ్ సిబ్బందికి న్యాయమూర్తి సూచన**

**పలాస, ఆగస్టు 11 (వార్త):** రాబోయే జాతీయ లోక్అదాలత్‌లో ఎక్కువ సంఖ్యలో రాజీ పడదగిన క్రిమినల్ కేసులను పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని పలాస ఫస్ట్ డివిజన్ న్యాయమూర్తి యు. మాధురి పోలీసు, ఎక్సైజ్ అధికారులను ఆదేశించారు. సెప్టెంబరు 12న నిర్వహించనున్న జాతీయ లోక్అదాలత్ ఏర్పాట్లపై మంగళవారం పలాస కోర్టు ఆవరణలో పోలీసు, ఎక్సైజ్ సిబ్బందితో ఆమె ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీకి అవకాశం ఉన్న క్రిమినల్ కేసులను ముందుగానే గుర్తించి, సంబంధిత పక్షాలతో సంప్రదింపులు జరిపి ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కేసుల్లోని అన్ని పక్షాలకు నోటీసులు అందజేస్తున్నట్లు తెలిపారు. జాతీయ లోక్అదాలత్ వరకు వేచి ఉండాల్సిన అవసరం లేకుండా ముందస్తు లోక్అదాలత్‌ల ద్వారా కూడా రాజీ చేసుకునే అవకాశం ఉందని న్యాయమూర్తి వివరించారు. ఈ సమావేశంలో కాశీబుగ్గ డీఎస్పీ టి. భవాని, రూరల్ సీఐ తిరుపతి, కాశీబుగ్గ ఎస్సై దుర్గాప్రసాద్, వజ్రపుకొత్తూరు ఎస్సై నిహార్‌తో పాటు పోలీసు, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.






## అప్పలరాజు విడుదల కోసం..
## ఆంజనేయస్వామికి మొక్కులు

**- 22 రోజులుగా జైలు..**

**-కక్షపూరిత అరెస్టులకు భయపడేది లేదన్న వైఎస్సార్‌సీపీ**

**పలాస, ఆగస్టు 11 (వార్త):** మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ నాయకుడు డాక్టర్ సీదిరి అప్పలరాజు జైలు నుంచి బెయిల్‌పై త్వరగా విడుదల కావాలని ఆకాంక్షిస్తూ వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలాస ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని శ్రీ అభయ ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం స్వామివారికి ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. అప్పలరాజును అరెస్టు చేసి 22 రోజులు గడుస్తున్నా బెయిల్ మంజూరు కాకపోవడం బాధాకరమని నాయకులు పేర్కొన్నారు. స్వామివారి ఆశీస్సులతో ఆయనకు త్వరగా బెయిల్ లభించి క్షేమంగా బయటకు రావాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు మాట్లాడుతూ అప్పలరాజుకు పార్టీ శ్రేణులు అండగా ఉంటాయని తెలిపారు.

కూటమి ప్రభుత్వం కక్షపూరితంగా ఆయనను అరెస్టు చేసిందని ఆరోపించారు. అరెస్టులకు భయపడేది లేదని, ప్రజాస్వామ్య పద్ధతిలో తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో 20వ వార్డు మాజీ కౌన్సిలర్ ప్రతినిధి అంబటి ఆనందరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు శాసుమాన శ్యామ్‌సుందర్, న్యాయవాది బొంపల్లి సునీల్‌వర్మ, గజ్జి బాలయ్య, బమ్మిడి సుధాకర్, కొల్లి దుర్గారావు, మధు, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ కార్యకర్తలకు జ్ఞానజ్యోతిపై శిక్షణ

**- చిన్నారులకు నాణ్యమైన విద్య, - పౌష్టికాహారం అందించడమే లక్ష్యం**

**సారవకోట, ఆగస్టు 11 (వార్త):** సారవకోట ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని జలుమూరు, సారవకోట మండలాల అంగన్వాడి కార్యకర్తలకు 'జ్ఞాన జ్యోతి' కార్యక్రమంపై మంగళవారం ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు మెరుగైన విద్యతో పాటు ఆరోగ్యం, క్రమశిక్షణ, పౌష్టికాహారం అందించే లక్ష్యంతో ఈ శిక్షణను నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా సీడీపీవో వంశీ ప్రియ మాట్లాడుతూ, చిన్నారుల ప్రాథమిక విద్యాభివృద్ధిలో అంగన్వాడీ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. చిన్నారుల వయసుకు అనుగుణంగా విద్యాబోధన, క్రమశిక్షణతో కూడిన అలవాట్లు, ఆరోగ్య పరిరక్షణ, పౌష్టికాహారంపై అంగన్వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పించేందుకు 'జ్ఞాన జ్యోతి' కార్యక్రమం ద్వారా ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. అంగన్వాడీ కార్యకర్తలు శిక్షణలో పొందిన అంశాలను కేంద్రాల్లో సమర్థవంతంగా అమలు చేసి చిన్నారుల సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. పిల్లలకు విద్యతో పాటు ఆరోగ్యకరమైన వాతావరణం, సమతుల్య పౌష్టికాహారం అందించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో జలుమూరు అంగన్వాడి సూపర్వైజర్ బి.సీతారత్నం, మనోహరి మరియు మావిడ అప్పన్న సిబ్బంద, సారవకోట మండలా పరిధిలోని అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.





## అంగన్వాడీ కార్యకర్తలకు శిక్షణ

**-చిన్నారుల సమగ్ర అభివృద్ధే లక్ష్యం**

**- ఐసీడీఎస్ పీవో శోభారాణి, ఎంఈఓ శాంతారావు**



**నరసన్నపేట, ఆగస్టు 11(వార్త):** అంగన్వాడీ కేంద్రాల్లోని చిన్నారుల సమగ్ర అభివృద్ధికి కృషి చేసే దిశగా అంగన్వాడీ కార్యకర్తలకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని ఐసీడీఎస్ పీవో శోభారాణి, ఎంఈఓ ఉప్పాడ శాంతారావు తెలిపారు. మంగళవారం నరసన్నపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన శిక్షణ తరగతులను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నారుల శారీరక, మానసిక వికాసానికి అవసరమైన చర్యలను అంగన్వాడీ కేంద్రాల ద్వారా సమర్థవంతంగా అమలు చేసేందుకు కార్యకర్తలకు శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. చిన్నారుల ఎదుగుదలలో ప్రారంభ దశ ఎంతో కీలకమని, వారి వయస్సుకు అనుగుణంగా విద్య, పోషకాహారం, ఆరోగ్య సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్యను అందించడం ద్వారా చిన్నారుల్లో అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ ద్వారా అంగన్వాడీ కార్యకర్తలు చిన్నారుల అవసరాలను మరింత సమర్థవంతంగా గుర్తించి, వారికి అవసరమైన విద్యా, పోషకాహార మరియు అభివృద్ధి కార్యక్రమాలను అందించాలని సూచించారు. చిన్నారుల సమగ్ర వికాసానికి అంగన్వాడీ కేంద్రాలు కీలక వేదికలుగా పనిచేస్తాయని వారు పేర్కొన్నారు.

## సంక్షేమ పథకాలు అందరికీ తెలియాలి

**- సెర్ప్ ఏపీఎం గొడబ ప్రసాదరావు**



**వజ్రపుకొత్తూరు, ఆగస్టు 11(వార్త):** ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలందరికీ తెలియాలని సెర్ఫ్ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజరు గొడబ ప్రసాదరావు అన్నారు. వజ్రపుకొత్తూరు మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ఏపీఎం గొడబ ప్రసాదరావు ఆధ్వర్యంలో ఎంఎంఎస్ ఈసీ మీటింగ్ జరిగింది. సమావేశంలో ప్రసాదరావు మాట్లాడుతూ ప్రతీ వీఓలో మన డబ్బులు-మన లెక్కలుపై వీఓ స్థాయిలో మహిళలకు అవగహన కల్పించాలన్నారు. ప్రతీ నెల 15వ తేదీలో లైవ్ మీటింగ్ కంప్లీట్ అయ్యేవిధంగా వీఓ మీటింగ్ లో విఓఏలకు తెలియజేయాలని వీఓ అధ్యక్షులకు తెలిపారు. రెగ్యులర్ గా స్త్రీనిధి, సీఐఎఫ్, రికవరీలు చెల్లించుకోవాలని అవగహన కల్పించారు. ఎంటర్ ప్రెన్యూర్ లను గూర్చి వివరించారు. కార్యక్రమంలో ఏపీఎం గొడబ ప్రసాదరావు, మండల సమాఖ్య అధ్యక్షురాలు సరస్వతి, సీసీలు, వీఓ అధ్యక్షులు, అకౌంటెంట్ మీనా పాల్గొన్నారు.

## సైదాల పుట్టుగలో ప్రత్యేక పారిశుధ్య పనులు



**ఇచ్ఛాపురం, ఆగస్టు 11 (వార్త):** పాయితారి పంచాయతీ సైదాల పుట్టుగ గ్రామంలో లో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ చేపట్టారు. ఇటీవలే నదిలో వరద నీరు ఎక్కువ గా చేరడం తో నదీ తీరంలో ఉన్న గ్రామాల్లో కలుషిత జలం తాగి ప్రజలు అనారోగ్యం బారిన పడకుండా ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టారు.అధికారులు గ్రామంలో పర్యటించారు.ఎంపీడీఓ ప్రభాకర్ రావు ఏ ఓ రామారావు డిప్యూటీ ఎంపీడీఓ లక్ష్మణ రావు,పంచాయతీ సెక్రటరీ షేక్ గపూర్, రేవతి ,మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు లోపింటి పద్మనాభం తదితరులు పాల్గొన్నారు.

## జ్ఞానభారతి స్కూల్‌లో స్కాలర్‌షిప్ పరీక్ష

**ఇచ్ఛాపురం, ఆగస్టు 11 (వార్త):** ఇచ్ఛాపురంలోని జ్ఞానభారతి పాఠశాలలో జేసీఐ ఆధ్వర్యంలో జాతీయ స్కాలర్‌షిప్, ఆప్టిట్యూడ్ టెస్ట్ 2026 నిర్వహించారు. మూడు క్యాటగిరీలలో 142 మంది విద్యార్థులు ఈ పరీక్షలో పాల్గొన్నారు. జేసీఐ క్లబ్ అధ్యక్షుడు బోయిన శ్రవణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పరీక్షలకు సంబంధించిన ప్రశ్న పత్రాలను... పాఠశాల కార్యదర్శి ముఖ్య కార్యనిర్వహణాధికారి జోహార్ ఖాన్ సమక్షంలో విద్యార్థులకు అందించారు. పరీక్షల అనంతరం విద్యార్థులకు పరీక్షల్లో పాల్గొన్న ధ్రువ పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో జేసీఐ ప్రతినిధులు షణ్ముఖరావు... ప్రిన్సిపాల్ ఐబి పండా, ప్రధానోపాధ్యాయురాలు రషీదా సుల్తానా, మేనేజర్ ప్రమోద్, అదనపు పరిపాలన అధికారిని సయ్యదా సుల్తానా, ట్రాన్స్‌పోర్ట్ మేనేజర్ అలీమ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

**-పలాస ఎంఎల్ఏ గౌతు శిరీష**

**- సరియాపల్లిలో ఇంటింటికీ**

**కూటమి ప్రభుత్వం**





**మందస, ఆగస్టు 11(వార్త):** కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చేందుకు కట్టుబడి ఉందని, ప్రజా సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని పరిష్కరించడమే లక్ష్యంగా ఇంటింటికీ కూటమి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని పలాస శాసనసభ్యురాలు గౌతు శిరీష అన్నారు. మందస మండలంలోని సరియాపల్లి గ్రామంలో మంగళవారం నిర్వహించిన ఇంటింటికీ కూటమి ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే గౌతు శిరీష ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గ్రామంలోని ప్రతీ ఇంటికీ తిరుగుతూ, ప్రజల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల గురించి ప్రజలకు వివరించారు. పలాస నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లడమే ప్రధాన ధ్యేయమన్నారు. సరియాపల్లి గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న మౌలిక సదుపాయాల కొరతను త్వరలోనే అధిగమిస్తామన్నారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మందస మండల అధ్యక్షుడు బావన దుర్యోధనతో పాటు స్థానిక నాయకులు, కూటమి మద్దతుదారులు, అధికారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే దృష్టికి పూరేటి వీధి కాలనీ దుస్థితి



**ఇచ్ఛాపురం, ఆగస్టు 11 (వార్త):** ఇచ్ఛాపురం మున్సిపాలిటీ పరిధి 12 వ వార్డు పూరేటి వీధి కాలనీ దుస్థితి ని ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బెందాలం అశోక్ దృష్టికి తీసుకువచ్చారు. తొనంగి శంకర్ ఆచారీ ఆధ్వర్యంలో కాలనీ వాసులు కలిసి వినతిపత్రం అందజేశారు.సుమారు 20 కుటుంబాలు జీవిస్తున్నారని కేవలం మట్టి రోడ్డు మాత్రమే ఉందని కాలువలు లేక చిన్న పాటి వర్షానికి బురదమయం అవుతోందని అన్నారు. మున్సిపల్ కమీషనర్ రమేష్ కి కూడా వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో గణేష్,నరేష్ పట్నాయక్ రంగాల రాజు మదన్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎమ్మెల్యే అశోక్ వివాహ వార్షికోత్సవం



**ఇచ్ఛాపురం, ఆగస్టు 11 (వార్త):** ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బెందాలం అశోక్ వివాహ వార్షికోత్సవం సందర్భంగా ఘనంగా వేడుకలు నిర్వహించారు. రాష్ట్ర రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ కొండ శంకర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆయన సౌజన్యం తో ఆర్టీసి కాంప్లెక్స్ ఆవరణలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేశారు.అనంతరం పేదలకు వస్త్రాలు దానం చేశారు.గత 9 ఏళ్ళుగా కోవిడ్ టైం లోనూ పార్టీ అధికారం లేని సమయంలో కూడా ప్రతి ఏటా కొండ శంకర్ రెడ్డి అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తూ ఉండడం విశేషం. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే అశోక్ పాల్గొని ప్రారంభించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు పత్రి తవిటయ్య,ఆసి లీలా రాణి సాలీనా ఢిల్లీ, నందికి జానీ సుభాష్ రౌలో, తిప్పన భాస్కర్ బెందాలం రమేష్ సంతోష్ రథో, సూర్యనారాయణ,శేఖర్ ప్రసాద్ కృష్ణయ్య పేదిని బాబ్జి ఆటో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

## అరసవల్లి ఆలయ బోర్డు మెంబర్‌గా మాజీ ఎంపీపీ కొర్ల కన్నారావు

**- అభినందనలు తెలిపిన నాయకులు, అభిమానులు**



**మందస, ఆగస్టు 11(వార్త):** అరసవల్లి సూర్యనారాయణ స్వామి దేవస్థానం కొత్త పాలక మండలి నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త ఇప్పిలి జోగ సన్యాసిరావు ఆలయ ప్రధాన అర్చకుడు, ఇప్పిలి శంకర్ శర్మ, ప్రత్యేక ఆహ్వానితులుగా కొత్త పాలక మండలి నియమించింది. ఇందులో సభ్యులుగా అందవరపు రఘురామ్, చింతపల్లి దుర్గారావు, గాంధీ జువ్వాది, విష్ణు ప్రియాంక , పాత్రని పాపారావు, వెంకటరావు, భారతి, డాక్టర్ దుంగ హర్షవల్లి, మంగళంపల్లి వరలక్ష్మి, కొర్ల కన్నారావు, కొయ్యన రామ్మోహనరావు, చవిటి పల్లి కొండలరావు నియమిస్తూ ప్రభుత్వం జీఓ ఆర్డీ నెంబర్ 859 విడుదల చేసింది.

మందస మండలంలోని బిన్నళమదనాపురం పంచాయతీలో గల వెంకటవరదరాజపురం గ్రామానికి చెందిన కొర్ల కన్నారావు అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయం బోర్డు మెంబర్ గా నియమితులయ్యారు. సంఘసేవకునిగా, సీనియర్ నాయకునిగా కన్నారావుకు మంచి పేరుంది. గాయత్రి ఛారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ గా పేదలకు సాయం చేస్తున్నారు. అంతేకాకుండా పలు సేవా సంస్థలో భాగస్వామిగా సామాజిక సేవలో పాలుపంచుకుంటున్నారు. ఈ సందర్భంగా కొర్ల కన్నారావు మీడియాతో మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో అధిష్టానం అప్పగించిన ఈ బాధ్యతను అత్యంత భక్తిశ్రద్ధలతో, ఆశించిన గౌరవం తెచ్చేలా నిబద్ధతతో నిర్వహిస్తానని స్పష్టం చేశారు. స్వామివారి సేవలో తరించే భాగ్యం కలగడం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు. అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయం బోర్డు మెంబర్ గా నియమించినందుకు స్థానిక ఎమ్మెల్యే గౌతు శిరీష, వ్యవసాయశాఖామంత్రి అచ్చంనాయుడు, కేంద్ర విమానయానశాఖా మంత్రి రామ్మోహన్నాయుడు, మాజీ మంత్రి గౌతు శివాజీ, తెలుగుదేశం పార్టీ పలాస సమన్వయకర్త వై.వెంకన్నచౌదరి కృతజ్ఞతలు తెలిపారు. కొర్ల కన్నారావును అరసవల్లి సూర్యనారాయణస్వామి ఆలయం బోర్డు మెంబర్ గా నియమితులైనందుకు వ్యాపారవేత్త మార్పు వెంకటేశం, కొంచాడ సురేష్ కుమార్, దుంపల శంకరరావు తదితరులు అభినందనలు తెలిపారు.

## అంగన్‌వాడీలకు జ్ఞానజ్యోతిపై శిక్షణ



**ఇచ్ఛాపురం, ఆగస్టు 11 (వార్త):** ఇచ్ఛాపురం మున్సిపల్ ఉన్నత పాఠశాలలో అంగన్ వాడీ కార్యకర్తలకు ఎఫ్ఎల్ఎన్ 3. 0 జ్ఞాన జ్యోతి శిక్షణ కోర్సుకు సంబంధించి మూడు రోజులు శిక్షణలో భాగంగా మొదటి రోజు శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. ఎం ఈ వో కాకర సూర్యారావు మాట్లాడుతూ అంగన్ వాడీ కేంద్రాల్లో ప్రతీ చిన్నారికి అర్థవంతంగా చదవడం, ఉద్దేశ్యపూర్వకంగా రాయడం, సంఖ్యా జ్ఞానాన్ని అర్థం చేసుకోవడం వంటి నైపుణ్యాలు అభివృద్ధి చేసే విధంగా తీర్చిదిద్దాలన్నారు. ఈ శిక్షణ ముఖ్య ఉద్దేశ్యం కూడా ఇదేనన్నారు. అంగన్ వాడీ సెంటర్లలలో ప్రీ ప్రైమరీ విద్యార్థులను ఎలా బోధించాలి అనే విషయంపై అంగన్ వాడీ వర్కర్స్ కు ట్రైనింగ్ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇంగ్లీష్ భాషపై అవగాహన కలిగించడానికి ఈ సెక్షన్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. శిక్షణను సద్వినియోగం చేసుకుని అంగన్ వాడీ సెంటర్లో సేవలు అందించాలని కోరారు.

## బాలల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయాలి




**సోంపేట, ఆగస్టు 11(వార్త):** అంగన్వాడీ కేంద్రాలలో బాలల సర్వతోముఖా భివృద్ధికి అందరం కలిసికట్టుగా కృషి చేయాలని స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారిని కే.వసుంధర దేవి, డిఆర్‌టిసి ఉపాధ్యాయులు, ఎంఈఓ జోరాడు పిలుపునిచ్చారు. ఈ మేరకు సోంపేటలో మంగళవారం అంగన్వాడి జ్ఞాన జ్యోతి శిక్షణా తరగతులను ప్రారంభించారు. దీన్ని ఉద్దేశించి అధికారులు మాట్లాడుతూ బాలలు మంచి ఆరోగ్యవంతంగా ఎదిగినప్పుడే భవిష్యత్తులో మంచి పౌరులుగా తీర్చిదిద్దబడతారని పేర్కొన్నారు. ఐసిడిఎస్ అందిస్తున్న సహకారంతో అంగన్వాడీ కేంద్రాల్లో బాలల ఆరోగ్యాన్ని పెంపొందించేందుకు నిరంతరం కృషి చేయాలని అన్నారు. నిర్లక్ష్యానికి తావు లేకుండా వారి పౌష్టికాహారం విషయంలో రాజీ పడకుండా సకాలంలో వారికి అందించి ఎటువంటి సమస్యలు తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు పాల్గొన్నారు.

## ఇచ్ఛాపురంలో .. రవాణా ఫిట్‌నెస్ సెంటర్ ఉండాలి

**ఇచ్ఛాపురం, ఆగస్టు 11 (వార్త):** ఇచ్ఛాపురం కేంద్రం గా రవాణా శాఖ ఫిట్నెస్ సెంటర్ ఉంచాలని



నియోజకవర్గ వైస్సార్సీపీ సమన్వయ కర్త సాడి శ్యాం ప్రసాద్ రెడ్డి డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రం లో 137 కిలోమీటర్లు దూరం లో తరలించడం వల్ల ఆటో ఇతర కమర్షియల్ వాహనాలు కి ఇబ్బందులు తలెత్తు న్నాయని అన్నారు. జాతీయ రహదారి పైన 60 కిలోమీటర్లు దూరం దాటితే అధికారులు ఫైన్ విధిస్తారని ఏదైనా ప్రమాదం జరిగితే ఇన్సూరెన్స్ కూడా వర్తంచదని అన్నారు. కేంద్రం రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడి నిర్ణయం అయితే జిల్లా లో ఉన్నారు కేంద్ర, రాష్ట్ర మంత్రులు టెక్కలి పలాస లో ఏర్పాటు కి ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. ఈ కార్యక్రమం లో రాష్ట్ర కార్యదర్శి నర్తు నరేంద్ర యాదవ్ జడ్పీటీసీ ఉప్పాడ నారాయణమ్మ ఆశి కృష్ణా రెడ్డి తడక జోగారావు సాడి దుర్యోధన రెడ్డి దేవరాజు అన్వేష్ ప్రేమ్ కుమార్ చాట్ల తులసీ దాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అనాథాశ్రమంలో టీడీపీ నాయకుల అన్నదానం



**ఇచ్ఛాపురం, ఆగస్టు 11 (వార్త):** సీతయ్య ఫౌండేషన్ లో అనాథ ఆశ్రమం లో వృద్ధుల కి అనాథ లకు రాష్ట్ర ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బెందాలం అశోక్ జన్మదినం , అశోక్ నీలోత్పల దంపతుల పెండ్లి రోజు శుభ సందర్భంగా రెండు రోజులు పూర్తిగా సరిపడ అన్న దానం నిర్వహించారు. పెదిన దుర్యోధన 5వేల రూపాయలు, పాతిర్లచంద్రశేఖర్ 5వేల రూపాయలు, ఇద్దరుసొంతనిధులు వెచ్చించారు. కార్యక్రమంలో మండలం మాజీ ఎంపీపీ దక్కతఢిల్లీరావు , లోపింటి పద్మనాభం,ఎపి రాష్ట్ర ప్రభుత్వ నాటక అకాడమీ డైరెక్టర్ దక్కత కామేశ్వరరావురెడ్డి, ఎస్ సహదేవ్, ఎ. మాధవ రెడ్డి, బి. లోహిదాస్, కురుస్వామి, ఎస్.ఢిల్లీ,ఆశి శంకర్, ఇసురు పద్మద్మనాభం తదితరులు పాల్గొన్నారు.

## వర్సిటీలో క్రీడల అభివృద్ధికి కృషి చేయాలి

**ఎచ్చెర్ల, ఆగస్టు 11 (వార్త):** డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో క్రీడల ప్రాధాన్యాన్ని పెంపొందిస్తూ, వాటి సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధతో కృషి చేయాలని వర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ కె.ఆర్.రజని సూచించారు. ఎచ్చెర్ల బి.ఆర్.అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో స్పోర్ట్స్ విభాగం నూతన డీన్‌గా డాక్టర్ అంకెం భాస్కర్ నియమితులైన సందర్భంగా జూలై 11 మంగళవారం విసి ఆయనకు నియామక ఉత్తర్వులను అందజేసి అభినందించారు. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడల్లోనూ మెరుగైన ప్రోత్సాహం అందించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రస్తుతం వర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగంలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా సేవలందిస్తున్న డాక్టర్ అంకెం భాస్కర్ కొత్త బాధ్యతల్లోనూ ప్రతిభ చాటాలని విసి ఆకాంక్షించారు. విశ్వవిద్యాలయంలో క్రీడా రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు, విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ప్రాధాన్యమిస్తానని నూతన డీన్ భాస్కర్ పేర్కొన్నారు.



## ఐదు లక్షలతో సిమెంట్ రహదారి నిర్మాణం

**కంచిలి, ఆగస్టు 11 (వార్త):** కేబీ నౌగాం గ్రామంలో ఐదు లక్షల రూపాయల అంచనా వ్యయంతో సిసి రహదారిని మంగళవారం నిర్మాణం చేపట్టారు. నిర్మాణ పనులను మండల టిడిపి అధ్యక్షుడు మాదిన రామారావు ప్రారంభించారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందని అన్నారు. కూటమి రెండేళ్ల పాలనలో ప్రతి గ్రామంలోనూ అభివృద్ధి చేపట్టడం జరిగిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పైల రామారావు, దుర్గాప్రసాద్ పండ,ఆనంద్, హరిబాబు, కిషోర్ పాల్గొన్నారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546